క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితుల ఇళ్లకు శంకుస్థాపన



ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ రాంజీ నగర్‌లో గత ఏడాది మే నెలలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అండగా నిలిచారు. నాటి ప్రమాదంలో ఐదు పూరిళ్లు అగ్నికి ఆహుతై, ఆయా కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. వారికి పలువురితో పాటు శివన్నారాయణ ఆర్థిక సహాయం అందజేసి, స్వయంగా పక్కా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా నిర్మాణాలకు శివన్నారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, బాధితులకు అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల కుటుంబరావు, గంజా కాశీ విశ్వనాథ్, వార్డు సభ్యుడు కావూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

14 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ

యానాం: ఈ నెల 14 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (వైడీసీఏ) అధ్యక్షుడు పంతగడ సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ పుదుచ్చేరి గుర్తింపు పొందిన తమ సంఘం ఆధ్వర్యాన 8 నుంచి 16 సంవత్సరాల బాల బాలికలకు ఈ శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో ఈ శిబిరం జరుగుతుందని, ఇందులో క్యాప్ లెవెల్-1 క్వాలిఫైడ్ కోచ్‌లతో శిక్షణ ఇస్తామని తెలిపారు. క్రికెట్ బేసిక్స్, ఫిట్‌నెస్ డ్రిల్స్, వీక్లీ ప్రాక్టీస్ మ్యాచ్‌లతో పాటు రిఫ్రెష్‌మెంట్ సైతం అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 96183 74688, 90522 42822 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



అయినాపురంలో కొత్తగా నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

ముమ్మిడివరం: అయినాపురంలో రూ.25 లక్షలతో నిర్మించిన శ్రీ వల్లీ, దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, పంచగవ్యం, దీక్ష ధారణ, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ నెల 13న వాస్తుపూజ, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయి. ఈ నెల 14న ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర స్థాపన, పూర్ణాహుతి, గోదర్శనం, దివ్య దర్శనం ఉంటాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

తెల్లదోమ నివారణపై అవగాహన పెంపొందించుకోవాలి

రావులపాలెం: కొబ్బరి రైతులు రూగోస్ వలయాకార తెల్ల దోమ నివారణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తెగుళ్లను అరికట్టవచ్చని ఉద్యాన శాఖ అధికారి అనూష అన్నారు. గురువారం మండలంలోని ఊబలంకలో కొబ్బరి తోటలకు వ్యాపించే రూగోస్ వలయాకార తెల్ల దోమ నివారణ చర్యల్లో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పసుపు రంగు జిగురు అట్టలను అంటించడం, బంధకాలను క్లిప్పింగ్ చేయడం, వేప నూనె ఇసారియా శిలీంధ్ర పిచికారీ చేయడం వంటి పలు రకాల నివారణ చర్యలపై రైతులను చైతన్యపరిచారు. ఈ చర్యలు పాటించడంతో తెల్లదోమ ఉధృతిని తగ్గించవచ్చన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఎస్ఎంఎస్ చైర్‌పర్సన్ సాకా మణికుమారి అన్నారు. నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రావులపాలేనికి చెందిన సాకా చిన్నిబాబు మెమోరియల్ ట్రస్టు చైర్మన్ సాకా ప్రసన్నకుమార్ గురువారం నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులు గిడ్డి చందు, కుసుమ లోకి, జల్లి దినేష్, తరిట్ల ప్రదీప్‌లతో పాటు, తల్లులను ప్రసన్నకుమార్ దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ జల్లి శ్రీను, సొసైటీ కమిటీ చైర్మన్ మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, పోతుల మనోజ్, నక్కా వెంకటరమణ, గాడి క్రిస్టోఫర్, కోనాల రాజు, సాకా రవి పాల్గొన్నారు.

పాల దిగుబడిపై వడదెబ్బ

- చూలు కట్టే అవకాశంపై ప్రభావం
- ప్రాణాలు కోల్పోయే ప్రమాదం
- రైతులు జాగ్రత్తలు పాటించాలంటున్న పశు వైద్యాధికారులు



ముమ్మిడివరంలో ఆరుబయట ఉన్న పశువులు

ఐ.పోలవరం: వారం రోజుల పాటు వానలు కురిశాయి. మబ్బులు మాయమయ్యాయి. తీవ్రమైన ఎండలతో సూర్యుడు చండప్రచండంగా చెలరేగిపోతున్నాడు. మరోపక్క ఉక్కపోత.. ఇటువంటి వాతావరణంలో మనుషులే కాదు.. పశువులు సైతం వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని అంటున్నారు పశు వైద్యాధికారులు. మండుతున్న వేసవిలో పశుపోషణ విషయంలో పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుత వాతావరణంలో పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ తగిలిన పశువు పాల ఉత్పత్తి తగ్గడమే కాక.. ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూలు కట్టే అవకాశం ఉండదని చెబుతున్నారు. వేసవి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గేదెలు, ఆవులపై సరైన శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై.. ఒక్కోసారి పశువు చనిపోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని ముమ్మిడివరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో 12,500 ఆవులు, 18,500 గేదెలు ఉన్నాయి. వీటి పోషణపై వేసవిలో మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలివే..

- వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతుంది. కలుషితమైన ఈ నీరు తాగితే వ్యాధి కారక క్రిములు శరీరంలోకి చేరి పశువులు పారుడు వ్యాధి బారిన పడతాయి. నీడలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే పశువులకు రోజుకు కనీసం నాలుగుసార్లు తాగించాలి.
- ఆవులతో పోలిస్తే గేదెలు నీటిని ఎక్కువగా తాగుతాయి.
- ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయస్సు ఆధారంగా రోజుకు సుమారు 35 లీటర్ల నీరు అవసరమవుతుంది.
- పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి.
- వడదెబ్బకు గురైన పశువుల శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల వరకూ పెరుగుతుంది.
- నడిచేటప్పుడు అవి తూలుతాయి. శ్వాసప్రక్రియ ఎక్కువవుతుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది.
- ఒక్కోసారి కింద పడి కొట్టుకుని స్పృహ కోల్పోతాయి.
- పశువు నీటి కోసం చూస్తూంటుంది. చర్మం ఎండిపోయినట్టు ఉంటుంది. పాల ఉత్పత్తి పడిపోతుంది.
- ఇటువంటి లక్షణాలుంటే వడదెబ్బ తగిలిందని గ్రహించి, దగ్గరలోని పశువైద్యులను సంప్రదించాలి.
- వడదెబ్బ తగిలినట్టు గుర్తించిన వెంటనే చల్లని నీటితో పశువు ముఖాన్ని కడగాలి. వస్త్రంలో ఐస్ చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి.

వడదెబ్బ తగలకుండా..



పశువుల పాక చుట్టూ పాత గోనెలు, పంచెలు, చీరలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పాక రేకులతో వేస్తే పైకప్పును కొబ్బరి, తాటి ఆకులు, వరి గడ్డితో కప్పాలి. ఎల్లప్పుడూ మంచినీరు అందుబాటులో ఉండేటట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే అంటే చల్లని వాతావరణంలోనే మేతకు వదలాలి. వీలైనంతగా పచ్చి మేత ఇవ్వాలి. సంకర జాతి ఆవులకు, గేదెలకు పంకాలు ఏర్పాటు చేయాలి.

– సీహెచ్ శ్రీరాం, పశువైద్యాధికారి, జి.వేమవరం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అమలాపురం రూరల్/ఉప్పలగుప్తం: ఈదరపల్లి 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పేరూరు, హైస్కూల్ ఫీడర్లలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈదరపల్లి శివాలయం ఏరియా, రెడ్ల కాలనీ, సుబ్బారాయుడు చెరువు, వడ్డిగూడెం, వడ్లమానివారి వీధి, శ్రీరామ్ నగర్, భూపయ్య అగ్రహారం, గోపాలకృష్ణ వీధి, బీకన్ హోటల్ రోడ్, తారకరామ నగర్, హైస్కూల్ రోడ్, సూర్యనగర్, గోఖలే సెంటర్, దొమ్మేటివారి వీధుల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. ఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్ ఈ విషయం గురువారం తెలిపారు.

- ఉప్పలగుప్తం సబ్ స్టేషన్ పరిధిలో ఉప్పలగుప్తం నుంచి కాట్రేనికోన వెళ్లే 33 కే విద్యుత్ తీగలను ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఆ సమయంలో ఉప్పలగుప్తం, మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, సన్నవిల్లి, గొల్లవిల్లి, వాసపల్లిపాలెం, ఎస్.కొత్తపల్లి, రాఘవులుపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని రవికుమార్ తెలిపారు.

పెట్రోలియం డీలర్లు నిబంధనలు పాటించాలి

యానాం: నియోజకవర్గంలోని అన్ని పెట్రోలియం రిటైల్ ఔట్‌లెట్ యాజమాన్యాలు తప్పనిసరిగా పుదుచ్చేరి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని యానాం ప్రాంతీయ పరిపాలనా అధికారి (ఆర్‌ఏఓ), పౌర సరఫరాల అధికారి మునిస్వామి గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ప్రతి డీలరూ తప్పనిసరిగా రిజిస్టర్ నిర్వహించాలని, క్రాస్ వెరిఫికేషన్ కోసం పౌర సరఫరాల అధికారికి మాత్రమే దీనిని సమర్పించాలని పేర్కొన్నారు. మోటార్ స్పిరిట్ (ఎంఎస్), హైస్పీడ్ డీజిల్ (హెచ్‌ఎస్‌డీ) ప్రతి విక్రయానికి సంబంధించిన బిల్లు, రశీదు నిర్వహించాలన్నారు. నాన్ బల్క్, రెసెప్టకిల్స్‌లో 2,500 లీటర్ల కంటే ఎక్కువ హెచ్‌ఎస్‌డీ విక్రయాలు ఉంటే పౌర సరఫరాల అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలనిస్పష్టం చేశారు. కొన్ని పెట్రోల్ బంకులు పగటి పూట మాత్రమే నిర్వహించి, రాత్రి వేళల్లో మూసివేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయని, బంకులు 24 గంటలూ పని చేయాలని ఆదేశించారు. ఆయా బంకుల వద్ద తప్పనిసరిగా శుభ్రమైన టాయ్‌లెట్ సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. బంకుల సాధారణ విధుల్లో ఎవరూ అనవసర జోక్యం చేసుకోరాదని, సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పెట్రోలు బంకుల పనితీరుపై ఫిర్యాదులను సంబంధిత పౌర సరఫరాల అధికారికి సమర్పించాలని మునిస్వామి సూచించారు.

కోదండ రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్

ఐ.పోలవరం: శెట్టిబలిజపాలెంలో కొత్తగా నిర్మించనున్న కోదండ రామాలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరి కాయ కొట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఢిల్లీ నారాయణ, సర్పంచ్ దంతులూరి రాఘవరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం



మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రం అందిస్తున్న 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉపాధ్యాయ నేతలు

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని డీఎస్సీ-1998 ఉపాధ్యాయులు తెలిపారు. రెండున్నర దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న తమకు ఉపాధ్యాయ ఉద్యోగాలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించారని పేర్కొన్నారు. అలాగే, తమ సర్వీసును 62 ఏళ్లకు పెంచాలని, ఒక్క రోజు నిలుపుదలతో 12 నెలల జీతం ఇవ్వాలని సీఎం జగన్‌ను కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. భట్నవెల్లిలోని నివాసంలో మంత్రిని 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్, నాయకులు ఎం.సాయిబాబు, ఎస్.కాశీ విశ్వేశ్వరరావు, ఎం.నాగరాజు గురువారం కలిశారు. తమ సమస్యలను వివరించారు. 25 ఏళ్ల తరువాత తమకు ఉద్యోగాలు వచ్చాయని, ఈ జాప్యం వల్ల చాలా నష్టపోయామని తెలిపారు.

ఊటనీటితో రహదారి ఛిద్రం



ఛిద్రమైన రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది మందార కాలువ చెంతన ఉన్న రహదారి ఛిద్రమైంది. స్థానిక చిన్న గుండం నుంచి మందార కాలువకు వెళ్లే రహదారి పైకి పక్కనే ఉన్న చెరువుల ఊట నీరు వస్తోంది. దీంతో రాకపోకలకు, సరకుల రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటూ ఆక్వా రైతులు కాట్నం దొరబాబు, పోశింశెట్టి లోవరాజు, శీలం శ్రీనివాస్, పుప్పాల విశ్వేశ్వరరావు, ఎం.వీరబాబు, రాయుడు గోవిందు, ధర్మారావు, కిరణ్ తదితర తీవ్ర ఆందోళన చేశారు. సమీప రైతు చెరువులకు అధికంగా నీరు తోడడం వల్ల తరచుగా ఈ సమస్య తలెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సొంత ఖర్చులతో ఈ రహదారిని బాగు చేసుకున్నామని తెలిపారు. మందార కాలువ చెంతన సుమారు 600 ఎకరాలకు ఇదే ప్రధాన రహదారిగా ఉందని, ఇది ఛిద్రం కావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. అధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఈ రహదారిని ప్రభుత్వ పరంగా అభివృద్ధి చేయాలని కోరారు.

ప్లాస్టిక్ నిషేధానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ



ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న గోయల్

యానాం: నియోజకవర్గంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కట్టుదిట్టంగా అమలు చేసేందుకు వివిధ శాఖల అధికారులతో ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు యానాం మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్ తెలిపారు. పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, యంత్రాంగం, పర్యవేక్షణ తదితర విషయాలపై గురువారం తన చాంబర్‌లో ఆయన చర్చించారు. ఇప్పటికే వర్తక సంఘాలు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, బార్ అండ్ రెస్టారెంట్లు, కూరగాయాలు తదితర వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. వారు సైతం ప్లాస్టిక్ నిషేధానికి సహకరిస్తామన్నారని చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీలో యానాం సీఐ షణ్ముగం, డిప్యూటీ తహసీల్దార్ (తూనికలు, కొలతలు) సి.గణేషన్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్, మున్సిపల్ జేఈ శ్రీనివాసకుమార్, ఎస్ఆర్‌కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ ఉంటారని వివరించారు. అనంతరం కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు.

స్టెనో పోస్టుకు ఎంపిక

11 ఏళ్ల తర్వాత ఎంపికైన యానాం యువతి



స్టెనోగ్రాఫర్‌పోస్టుకు ఎంపికైన ఇందిర

యానాం: నియోజకవర్గంలోని ఫరంపేట గ్రామానికి చెందిన యువతి చేటకాల ఇందిర స్టెనోగ్రాఫర్ పోస్టుకు ఎంపికైంది. పుదుచ్చేరి ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న స్టెనో గ్రాఫర్ పోస్టులకు గత నెల 30న పుదుచ్చేరి టెక్నలాజికల్ యూనివర్సిటీలో పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ ఫలితాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ గురువారం విడుదల చేసింది. ఇందులో ఇందిర జనరల్ కేటగిరీలో ఎంపికైంది. ఎంపికైన వారికి త్వరలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, సమయం, తేదీ తరువాత తెలియజేస్తామని ప్రభుత్వ కార్యదర్శి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎల్.కుమార్ తెలిపారు. యానాం నుంచి 2012లో కొల్లు లక్ష్మీవర ప్రసాద్ మాత్రమే స్టెనోగ్రాఫర్ పోస్టుకు ఎంపికయ్యారు. మళ్లీ 11 ఏళ్ల తరువాత యానాం నుంచి రెండో వ్యక్తిగా ఇందిర ఎంపికవడం విశేషం. 2012 తర్వాత మూడుసార్లు స్టెనోగ్రాఫర్ పోస్టులకు నోటిఫికేషన్ వేసినప్పటికీ పరీక్ష నిర్వహించలేదు.

కపిలేశ్వరపురంలో శాంతి కల్యాణం

కపిలేశ్వరపురం: స్థానిక గాంధీ సెంటర్ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం శాంతి కల్యాణ పూజలు చేశారు. రిటైర్డ్ ఆడిటర్ సుగంధం వీరవెంకట సత్యనారాయణ కుమారులు బాల సత్యనాగేంద్ర, దేవి దంపతులు, భవాని నాగేంద్ర, సునీత దంపతులు పూజలు చేశారు. అనంతరం వారి ఆర్థిక సౌజన్యంతో భారీ అన్నదానం నిర్వహించారు.

రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆత్రేయపురం: ప్రస్తుత రబీ సీజన్‌లో అరుగాలం శ్రమించి ధాన్యాన్ని పండించి, అకాల వర్షాల బారిన పడి తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని మెర్లపాలెంలో గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి, ధాన్యం పండించిన రైతుల స్థితిగతులను, వారి నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అలాగే మినీ రైస్ మిల్లులో ధాన్యాన్ని ఆడించి నూక శాతాన్ని, రైతు భరోసా కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు సకాలంలో ధాన్యం పట్టుబడికి గోనె సంచులు సరఫరా కావడం లేదని, అదే విధంగా మిల్లర్లు నూక శాతం ఎక్కువగా ఉందని 100 కేజీలకు 5 కేజీలు తగ్గిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కొనుగోలు చేయాలని, ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించి మిల్లర్లు ధరను తగ్గిస్తున్నారన్నారు. ఒక రైతు రూ.23 వేల నగదు చెల్లించామని పలువురు రైతులు ధాన్యం కొనుగోలులో సమస్యల గురించి ఆయనకు వివరించారు. దీనిపై ఆయన స్పందించి జిల్లాలో రైస్ మిల్లర్లతో రైతులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలని సకాలంలో గోనె సంచులు సరఫరా చేయాలని జిల్లా జేసీకి సూచించారు.

ఎండు గడ్డికి పెరిగిన డిమాండ్



ముక్కామలలో యంత్రాలతో కోసిన వరి చేను

అంబాజీపేట: వరి కోత యంత్రాల ద్వారా పంటను నూర్పిడి చేయడంతో ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. గతంలో రబీ పంటను కూలీలతో కోత కోసి ట్రాక్టర్‌తో నూర్పిడి చేయడంతో ఎండుగడ్డి లభించేది. అయితే ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అలవాటు పడిన రైతులు పంటను నూర్పిడి చేయడానికి వరి కోత యంత్రాలను వినియోగించడంతో ఎండు గడ్డిని ఒబ్బిడి చేయడానికి రైతులు పెద్ద ఆసక్తి చూపించేవారు కాదు. ఇటీవల కాలంలో పశువులకు ప్రధాన ఆహారమైన ఎండుగడ్డికి డిమాండ్ పెరిగింది. దీంతో చేలల్లో పడి ఉన్న ఎండుగడ్డిని ఒబ్బిడి చేయడానికి రైతులు యంత్రాలను, కూలీలను ఉపయోగిస్తున్నారు. కొంత మంది రైతులు చేలల్లోని గడ్డిని కూలీలతో ఒబ్బిడి చేస్తుండగా, మరికొంత మంది గడ్డిని కట్టలు కట్టే యంత్రంతో ఎండుగడ్డిని కట్టుల కట్టించి, గడ్డివాములు వేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో పశుపోషణపై రైతులు ఆసక్తి కనబర్చడంతో గతంలో కంటే ఈ సారి చేలల్లో ఉన్న ఎండుగడ్డిని ఎక్కువగా సేకరిస్తున్నారు. ఎకరా ఎండు గడ్డి ప్రస్తుతం రూ.4000 వరకు పలుకుతుందన్నారు. వీటితో టాక్టర్ కిరాయి, కూలీల ఖర్చు కలిపి మరో రూ.రెండు వేలు అదనంగా అవుతుందని రైతులు చెబుతున్నారు.

సేవే లక్ష్యం...

- మానవత్వానికి చిరునామా నర్స్
- ప్రజారోగ్య పరిరక్షణలో శ్రమిస్తున్న వైనం
- రెండు నియోజకవర్గాల్లో వందలాది మంది సేవలు
- నేడు ప్రపంచ నర్సింగ్ దినోత్సవం



అంగర పీహెచ్‌సీలో కరోనా వ్యాక్సిన్ వేస్తున్న నర్సులు (ఫైల్)

కపిలేశ్వరపురం: మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి ప్రతి ఒక్కరికీ ఓ అవకాశం వస్తూనే ఉంటుంది. మనిషి ప్రాణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడే అవకాశం దక్కడం అన్నింటిలో ఓ అద్భుత అవకాశం. వైద్య రంగంలో డాక్టర్‌కు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ప్రాణరక్షణకై విశేష కృషి చేసే నర్సులకూ అంతే ప్రాధాన్యం ఉంటుంది. రాత్రింబవళ్లు రోగుల ప్రాణ రక్షణకు వారు పాటుపడతారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పిస్తారు. ఇలా.. నిరంతరం కృషి చేసే నర్సుల సేవలను గుర్తించడం మానవ ధర్మం. నేడు నర్సింగ్ దినోత్సవం సందర్భంగా ఈ కథనం..

ఇదీ నేపథ్యం

ఇటలీలోని ధనిక కుటుంబంలో 1820, మే 12న జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ 1910 ఆగస్టు 13 వరకూ జీవించారు. యుద్ధ క్షతగాత్రులకు, ప్రకృతి వైపరీత్యాలతో గాయాలైనవారికి వైద్యసేవలందించడంతో పాటు వైద్య సేవలపై పలు రచనలు చేశారు. ఈమె జన్మదినమైన మే 12న ప్రపంచ నర్సింగ్ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.


రెండు నియోజకవర్గాల్లో నర్సులు ఇలా...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 16 పీహెచ్‌సీలలో 48 మంది స్టాఫ్ నర్సులు, 29 మంది ఫార్మసిస్టులు ఉన్నారు. వారితోపాటు జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నర్సులుగా పని చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో ఏఎన్ఎంలుగా రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో వేలాది మంది సేవలు అందిస్తున్నారు. ఆశ కార్యకర్తలు గర్భిణి, బాలింతల బాగోగులు చూసుకుంటున్నారు. మూడున్నర ఏళ్లలో రాష్ట్రంలో 5,777 మంది నర్సుల పోస్టులను, 10,032 మంది ఎంఎల్‌హెచ్‌పీలను 9,751 మంది పారా మెడికల్ సిబ్బందిని ప్రస్తుత ప్రభుత్వం నియమించింది.

సేవలు అమోఘం

రాష్ట్రంలో 3,86,86,305 మందికి ఆరోగ్య పరీక్షలు పూర్తి చేసి వారందరికీ హెల్త్ ఐడీలను జారీ చేసింది. ఈ విషయంలో నేషనల్ హెల్త్ అథారిటీ-ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఏపీకి రెండో స్థానాన్ని ప్రకటించడంలో క్షేత్ర స్థాయి వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషి ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 54 నర్సింగ్ స్కూళ్లలో చదువుకున్న వందలాది మంది నర్సింగ్ విద్యార్థులు ఉద్యోగంలో చేరాక వివిధ స్థాయిల్లో ఆరోగ్య, ప్రాణ పరిరక్షణకై కృషి చేస్తున్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పేరుతో గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో 555 మంది గర్భిణులకు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించి సంరక్షిస్తున్నారు. వారిలో 128 మందిని హైరిస్క్ కేసులుగా గుర్తించి మరింత మెరుగైన సేవలు అందిస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లో 325 పాఠశాలల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో 28,192 విద్యార్థులకు రక్తహీనత స్థాయిని పరీక్షించి మందులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలి కరోనా కేసు నమోదైన 2020 మార్చి 24 నుంచి నేటి వరకూ అనేక పర్యాయాలు క్షేత్రస్థాయిలో కరోనా పరీక్షలు చేయడం, వ్యాక్సిన్ వేయడమనే సేవలందిస్తూనే ఉన్నారు. జిల్లాలోని ఏడు కేంద్రాల్లోని సుమారు 750 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకూ జిల్లా వ్యాప్తంగా 3,361 మంది తల్లీ బిడ్డలను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంలో నర్సులు కృషి ఉంది. 2022 డిసెంబర్‌వరకూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 43,164 మంది లబ్ధిదారులకు రూ.157.31 కోట్ల విలువైన చికిత్స చేయగా వారందరికీ నర్సులు సేవలందించారు.

సేవేలక్ష్యంగా పనిచేస్తున్నాం



నేను అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలోని వడ్లమూరులో ఏఎన్ఎంగా పని చేస్తున్నాను. నాతోటి వైద్య ఆరోగ్య కార్యకర్తలు, ఆసుపత్రిలోని స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు ఇలా అందరూ సేవా దృక్పథంతో పనిచేస్తున్నారు. వైద్యుల ఆదేశాలపై చికిత్స, ప్రభుత్వ ఆదేశాలపై ఆరోగ్య కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం.

– పేరూరి విజయదుర్గ, ఏఎన్ఎం, అచ్యుతాపురం పీహెచ్‌సీ